RNI NO TGTEL/25/A3369

సమస్త ప్రక్షాళనం

తెలుగు దినపత్రిక

ప్రచురణ : సంగారెడ్డి, సంపుటి : 01 సంచిక : 195 ఎడిటర్ : జె. భాస్కర్, శుక్రవారం 13-11-2026 పేజీలు : 04 వెల : 2/-



‘22ఏ దరఖాస్తుల్లో ఒక్కటి కూడా పెండింగ్‌లో ఉండొద్దు’- కలెక్టర్లకు మంత్రి పొంగులేటి ఆదేశం

2లో

- 22ఏ భూ సమస్యల పరిష్కారం మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కలెక్టర్లకు ఆదేశాలు జారీచేశారు.
- ఈ భూములకు సంబంధించి ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలన్నారు.

ఏపీకి దిగ్గజ సంస్థల పెట్టుబడులు.. సీఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పందాలు



2లో

- విశాఖ సీఐఐ సదస్సులో కీలక పారిశ్రామిక ఒప్పందాలు
- రిలయన్స్ సహా పలు దిగ్గజ సంస్థల పెట్టుబడులు
- కోకా-కోలా కెల్లాగ్స్ సంస్థలకు అనుమతుల జీవోలు అందజేత
- కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్ రామ్మోహన్ నాయుడు

డిసెంబర్ నాటికి ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం పూర్తి కావాలి

- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

- డిసెంబర్ నాటికి ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం పూర్తి కావాలని సీఎం అధికారులను ఆదేశించారు.
- ఆరోగ్యశాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు.



హైదరాబాద్ : జూన్ 2 నాటికి అన్ని టిమ్స్‌లు అందుబాటులోకి రావాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. డిసెంబర్ వరకు ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం పూర్తికావాలని సూచించారు. మూడు టిమ్స్‌లకు ఒకేసారి నియామకాలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. వాటి ఉద్యోగుల బదిలీలు జరిగేలా ఉండాలన్నారు. టిమ్స్ హౌస్ కీపింగ్‌ను పూర్తిగా ఔట్‌సోర్సింగ్‌కు ఇవ్వాలన్నారు. వైద్యారోగ్యశాఖపై అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. నిమ్స్ లో బెడ్స్ ఖాళీ లేక పోతే రోగులను సనత్ నగర్ టిమ్స్‌కు తరలించాలని సూచించారు. నిమ్స్,టిమ్స్ మధ్య సమన్వయం ఉండాలని అధికారులకు స్పష్టం చేశారు. సనత్ నగర్ టిమ్స్‌లో డాక్టర్ల నియామకమయ్యే వరకు బయట నుంచి నియమించుకోవాలని అధికారులకు సూచించారు. టిమ్స్, ప్రభుత్వ వైద్య కళాశాలలకు అదనంపు నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధమని తెలిపారు.

వ్యవసాయ ఆధునీకరణతోనే ‘వికసిత్ భారత్’ సాధ్యం

- వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించకుండా ‘వికసిత్ భారత్’ నిర్మాణం అసాధ్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.



వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించకుండా, సాగును స్మార్ట్‌గా మార్చకుండా, రైతులకు మరింత సాధికారత కల్పించకుండా ‘వికసిత్ భారత్’ నిర్మాణం అసాధ్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. వ్యవసాయ రంగం దేశ ప్రగతికి, సంస్కృతికి, సామాజిక జీవితానికి కేంద్ర బిందువు అని ఆయన అభివర్ణించారు. దేశంలో ప్రస్తుతం జరుగుతున్న పండుగ సీజన్‌ను, ముఖ్యంగా ఛత్ పండుగను, భారతదేశ వ్యవసాయ సంప్రదాయాలతో ముడిపెట్టారు. వ్యవసాయం దేశ జీవన విధానంతో ముడిపడి ఉందని అన్నారు. గురువారం నిర్వహించిన భారత్ అగ్రికల్చర్ కాన్‌క్లేవ్‌లో మోదీ ఈ మేరకు ప్రసంగించారు. ఎర్రకోట నుంచి తాను చేసిన ప్రసంగాన్ని గుర్తు చేసిన మోదీ, వికసిత్ భారత్ నిర్మాణానికి గుర్తించిన ఏడు ప్రధాన బలాల్లో వ్యవసాయం కూడా ఒకటని అన్నారు.

శత్రువుకు కోలుకునే సమయం ఇవ్వకుండా దెబ్బతీయాలి

- ఆకస్మిక దాడులను తిప్పికొట్టేలా ఉండాలి
- శత్రువుకు కోలుకునే సమయం ఇవ్వకుండా దెబ్బతీయడంతో పాటు, ఆకస్మిక దాడులను తిప్పికొట్టే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సూచించారు.



ఆధునిక యుద్ధ తంత్రంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా త్రివిధ దళాలు నిత్యం అప్రమత్తంగా ఉండాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సూచించారు. శత్రువుకు కోలుకునే సమయం ఇవ్వకుండా దెబ్బతీయడంతో పాటు, ఆకస్మిక దాడులను తిప్పికొట్టే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. దిల్లీలో జరిగిన వైమానిక దళ కమాండర్ల సమావేశంలో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడారు. రక్షణ, ప్రతిదాడుల విషయంలో అధునాతన పద్ధతులను బలోపేతం చేసుకోవాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ముప్పు ముంచుకు రాకముందే గుర్తించేలా నిఘా,

మిగతా 2లో



రాష్ట్రంలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

- రాష్ట్రంలో 21 మంది ఐపీఎస్‌లను ప్రభుత్వం బదిలీ చేసింది.
- హైదరాబాద్ సీపీగా మహేశ్ భగవత్‌ను నియమించింది.

క్లీన్ ఎనర్జీ రంగంలో ఏపీని సౌదీ అరేబియాలా తీర్చిదిద్దుతాం



- 2028 నాటికి రాష్ట్రంలో రెట్టింపు కానున్న విద్యుత్ అవసరాలు
- గ్రీన్ ఎనర్జీ ఆధారంగానే నడిచేలా ఎయిర్ కూల్డ్ డేటా సెంటర్లు
- రాష్ట్రంలో ఇప్పటివరకు 5 లక్షల ఉద్యోగాలు కల్పించిన కూటమి ప్రభుత్వం
- రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధికి విధానపరమైన స్థిరత్వం ఎంతో ముఖ్యమన్న లోకేశ్

‘రూ.7 కోట్లు ఇవ్వకుంటే కేజ్రీవాల్‌ను చంపేస్తాం’ - దిల్లీ మాజీ సీఎంకు బిష్ణోయ్ గ్యాంగ్ వార్నింగ్!



- ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌ను చంపేస్తామంటూ బెదిరింపులు వచ్చాయి.

2లో

- గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ ముఠా పేరుతో ఈ బెదిరింపు ఫోన్ కాల్ వచ్చినట్లు పోలీసులు తెలిపారు.

“బస్” కరో... తప్పుల తడకలు

2లో





- పాస్‌పై ఒక నంబర్.. ఐడీ కార్డులో మరొకటి
- ఇష్టానుసారంగా బస్ పాస్‌లు జారీ చేస్తున్న ఆర్టీసీ
- సరిచేయాలని వెళితే నిర్లక్ష్యంగా సమాధానం
- ఆర్టీసీ సిబ్బంది చేసిన తప్పిదానికి ప్రయాణికులు బలి
- గ్రేటర్ పరిధిలో 43 బస్ పాస్ జారీ కేంద్రాల్లో సగానికి పైగా తప్పిదాలే

రాష్ట్రంలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

- రాష్ట్రంలో 21 మంది ఐపీఎస్‌లను ప్రభుత్వం బదిలీ చేసింది.
- హైదరాబాద్ సీపీగా మహేశ్ భగవత్‌ను నియమించింది.

వైట్‌హౌస్ సమీపంలో కాల్పులు - వీధులను దిగ్బంధించిన పోలీసులు

- ట్రంప్ శ్వేతసౌధంలో ఉన్నారా?



2లో

- వాషింగ్టన్‌లో అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌కు సమీపంలో ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో ఐదుగురు మరణించారు.

వ్యవసాయ ఆధునీకరణతోనే 'వికసిత్ భారత్' సాధ్యం

గత దశాబ్దంలో భారతదేశ వ్యవసాయ వృద్ధి రేటు నాలుగు శాతానికి పైగా ఉందని, స్వాతంత్ర్యం తర్వాత దేశం ఇంతటి వృద్ధిని సాధించిన మొదటి దశాబ్దం ఇదేనని ఆయన అభివర్ణించారు. అంతేకాకుండా, పేదరికంలో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వచ్చిన తగ్గుదల గురించి ఆయన ప్రస్తావించారు. ప్రపంచ బ్యాంకు ఇటీవల విడుదల చేసిన ఒక అధ్యయనాన్ని ప్రస్తావిస్తూ, భారత్‌లో 50 కోట్ల మంది ప్రజలు కేవలం 12-13 ఏళ్లలోనే పేదరికం నుంచి బయటపడ్డారని పేర్కొన్నారు. రైతులు, వ్యవసాయ కూలీలు పేదరికం నుంచి బయటపడ్డారని ఆ అధ్యయనం పేర్కొందని చెప్పారు.

ఏటా రూ. 4 లక్షల కోట్లకు పైగా వ్యవసాయ ఉత్పత్తులు ఎగుమతి

భారత్ నుంచి జరుగుతున్న వ్యవసాయ ఎగుమతుల గురించి ప్రస్తావిస్తూ, ప్రతి ఏటా రూ. 4 లక్షల కోట్లకు పైగా విలువైన వ్యవసాయ ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేస్తోందని మోదీ పేర్కొన్నారు. ఫలితంగా రైతుల ఆదాయం పెరుగుతోందని చెప్పారు. పాలు, పప్పుధాన్యాలు, జనపనార (జూట్), బియ్యం, చిరుధాన్యాల ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉందని తెలిపారు. "గోధుమలు, పత్తి, పండ్లు, కూరగాయల ఉత్పత్తిలో భారత్ రెండో స్థానంలోనే ఉంది. చేపల ఉత్పత్తిలో ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉన్న భారతదేశం, చిరుధాన్యాల ఉత్పత్తిలో ప్రపంచంలోనే అతిపెద్ద దేశంగా నిలిచింది. ఇవి కేవలం గణాంకాలు మాత్రమే కావు. ఇవి భారతీయ రైతుల అపార సామర్థ్యాన్ని తెలియజేస్తాయి."

గత దశాబ్ద కాలంలో పాడి పరిశ్రమ, కోళ్ల పెంపకం, మత్స్య రంగం, తేనెటీగల పెంపకం, ఉద్యానవన రంగం వంటి అనుబంధ వ్యవసాయ రంగాల్లో సాధించిన వృద్ధిని కూడా ప్రధాని మోదీ వివరించారు. "గత పదేళ్లలో భారతదేశంలో పాల ఉత్పత్తి దాదాపు 70 శాతం పెరిగింది. గుడ్ల ఉత్పత్తి 90 శాతం వృద్ధి చెందింది. అలాగే, మత్స్య ఉత్పత్తి రెట్టింపు కంటే ఎక్కువ పెరిగింది. 'స్వీట్ రివల్యూషన్' తేనెటీగల పెంపకంలో కొత్త అవకాశాలను కల్పించింది. తేనె ఉత్పత్తి 80,000 టన్నుల నుంచి 1,50,000 టన్నులకు పెరిగింది" అని మోదీ పేర్కొన్నారు.

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న సమయంలో అంతర్జాతీయ మార్కెట్‌లో పెరిగిన ముడి చమురు ధరల గురించి మోదీ గుర్తు చేసుకున్నారు. "పశ్చిమాసియాలో యుద్ధ ముప్పు పొంచి ఉన్నప్పుడు, ముడి చమురు ధరలు కొన్ని వారాల వ్యవధిలోనే బారెల్‌కు 70 డాలర్ల నుంచి 122 డాలర్లకు పెరిగాయి. అప్పట్లో భారత్ ఒక పెద్ద సవాలును ఎదుర్కొంది. డీజిల్ ధరను లీటరుకు కనీసం రూ.50 మేర పెంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ క్లిష్ట సమయంలో, ప్రభుత్వం మన రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఒక నిర్ణయం తీసుకుంది. రూ.50 పెంపునకు బదులుగా, ప్రభుత్వం డీజిల్ ధరను లీటరుకు కేవలం 7 రూపాయలు మాత్రమే పెంచి, మిగిలిన 43 రూపాయల భారాన్ని భరించింది. మన పొరుగు దేశాల్లో చాలా చోట్ల డీజిల్ ధరలు 40 శాతం నుంచి 50 శాతం వరకు పెరిగాయి. కానీ భారత్‌లో అలా జరగలేదు. అప్పటి నుండి, ప్రభుత్వం ప్రతి నెలా రూ.14,000 కోట్ల నష్టాన్ని భరిస్తూ వస్తోంది" అని మోదీ పేర్కొన్నారు.

క్లీన్ ఎనర్జీ రంగంలో ఏపీని సౌదీ అరేబియాలా తీర్చిదిద్దుతాం

క్లీన్ ఎనర్జీ రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను సౌదీ అరేబియాలా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. విశాఖపట్నంలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా 'భారతదేశ ఇంధన భవిష్యత్తుకు ఊతమివ్వడం: పునరుత్పాదక ఇంధన వనరులు, గ్రీన్ హైడ్రోజన్' అంశంపై నిర్వహించిన ప్రత్యేక ప్లీనరీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మారుతున్న అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ పరిస్థితుల దృష్ట్యా దేశం ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధించాల్సిన అవసరం ఎంతో ఉందని పేర్కొన్నారు.

సౌర, పవన, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో భారీగా స్వచ్ఛమైన విద్యుత్‌ను ఉత్పత్తి చేయడమే కాకుండా, దానిని గ్రీన్ మాలిక్యూల్స్‌గా మార్చి అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేసే సత్తా ఏపీకి ఉందని లోకేశ్ వివరించారు. సీఎం చంద్రబాబు నాయుడు కూడా ఇంధన స్వయం సమృద్ధిపై స్పష్టమైన విధానంతో ఉన్నారని గుర్తుచేశారు. రాయలసీమలో పుష్కలమైన సూర్యరశ్మి, ఇతర ప్రాంతాల్లో పవన విద్యుత్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ఏర్పాటుకు అత్యంత అనుకూలమైన వాతావరణం ఉందని తెలిపారు.గత ఏడాది కాలంలోనే రాష్ట్రంలో విద్యుత్ వినియోగం దాదాపు 30 శాతం పెరిగిందని, కొత్తగా వస్తున్న పరిశ్రమలు, డేటా సెంటర్ల కారణంగా 2028 నాటికి విద్యుత్ డిమాండ్ రెట్టింపు అయ్యే అవకాశముందని మంత్రి విశ్లేషించారు. ఈ పెరిగే డిమాండ్‌ను తట్టుకోవడానికి పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడంపై దృష్టి సారించినట్లు చెప్పారు. సంప్రదాయ జలవిద్యుత్ ప్రాజెక్టుల మాదిరిగా ఏళ్ల తరబడి సమయం తీసుకోకుండా, ఆధునిక సాంకేతికతతో ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం పెరగకముందే వాటిని పూర్తి చేయాల్సి ఉందని స్పష్టం చేశారు. రాత్రి సమయాల్లో కూడా పోటీ ధరలకే నిరంతరాయంగా గ్రీన్ ఎనర్జీని సరఫరా చేయడమే తమ ముందున్న ప్రధాన లక్ష్యమన్నారు.

పరిశ్రమల అభివృద్ధికి విధానపరమైన స్థిరత్వం ఎంతో అవసరమని లోకేశ్ నొక్కిచెప్పారు. 2019 నుంచి 2024 మధ్య కాలంలో సరైన పాలసీలు లేకపోవడం వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని గుర్తుచేశారు. ఆ ఐదేళ్ల కాలంలో కేవలం 6 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యం మాత్రమే అదనంగా చేరగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఏడాది కాలంలోనే ఏకంగా 4.8 గిగావాట్ల పునరుత్పాదక సామర్థ్యాన్ని సాధించినట్లు వెల్లడించారు. పారిశ్రామికవేత్తలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తున్నామని చెప్పారు.

రాష్ట్రంలో ఏర్పాటవుతున్న డేటా సెంటర్లపై వస్తున్న అపోహలను మంత్రి నారా లోకేశ్ తోసిపుచ్చారు. గూగుల్ డేటా సెంటర్ వంటి ప్రాజెక్టులు సాంప్రదాయ నీటి ఆధారిత కూలింగ్ కాకుండా, అత్యాధునిక 'ఎయిర్ కూల్డ్' పద్ధతిలో పనిచేస్తాయని తెలిపారు. ఒక గిగావాట్ థర్మల్ పవర్ ప్లాంట్‌తో పోలిస్తే డేటా సెంటర్లు దాదాపు పది రెట్లు తక్కువ నీటిని వినియోగిస్తాయని గణాంకాలతో వివరించారు. అంతేకాకుండా రాష్ట్రంలోని డేటా సెంటర్ల విద్యుత్ అవసరాల్లో కనీసం 80 శాతాన్ని గ్రీన్ ఎనర్జీ ద్వారానే సమకూర్చాలనే స్పష్టమైన నిబంధన విధించినట్లు వెల్లడించారు. భారత పౌరుల డేటా దేశ సరిహద్దుల్లోనే భద్రంగా ఉండటం జాతీయ భద్రత దృష్ట్యా అత్యంత ఆవశ్యకమని పేర్కొన్నారు.

ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రజలకు హామీ ఇచ్చామని, ఇప్పటికే వివిధ రంగాల్లో దాదాపు 5 లక్షల ఉద్యోగాలను కల్పించగలిగామని లోకేశ్ తెలిపారు. రాష్ట్రంలో గుర్తించిన 25 పారిశ్రామిక క్లస్టర్లను పూర్తి సామర్థ్యంతో తీర్చిదిద్దుతున్నామన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ టారిఫ్‌లు తక్కువగా ఉన్నాయని, భవిష్యత్తులో ఈ ధరలను మరింత తగ్గించి పెట్టుబడులను పెద్దఎత్తున ఆకర్షిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

"బస్" కరో...తప్పుల తడకలు

హైదరాబాద్ : ఎవరు ఏమనుకుంటే మాకేంటి? అన్న చందంగా మారింది ఆర్టీసీ బస్‌పాస్ విభాగం పరిస్థితి. పై స్థాయి ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువవడంతో క్షేత్రస్థాయిలో సిబ్బంది బస్ పాస్‌ల జారీలో నిర్లక్ష్యం కనబరుస్తున్నారు. బస్ పాస్‌ల్లో పేర్లలో తప్పిదాలు, రిజిస్ట్రేషన్ సంఖ్యలో మార్పులు, స్టేజీలలో తప్పిదాలు ఇలా అనేక రకాలుగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇష్టాను సారంగా బస్ పాసులు జారీ అవ్వడంతో ప్రయాణికులు సంబంధిత విభాగాలను ఆశ్రయిస్తే సమస్య పరిష్కరించకపోగా 'మీకు బస్ పాస్ జారీ చేసిన వ్యక్తి ఈ రోజు లీవ్‌లో ఉన్నాడు. అతడు ఎప్పుడొస్తాడో తెలియదు. రోజు వచ్చి చూడండి. ఉన్నప్పుడు చేస్కోండి.. లేదా కొత్తది తీస్కోండి.' అంటూ సిబ్బంది సమాధానం ఇస్తున్నారు. దీంతో ప్రయాణికులు బస్ పాస్‌కు నెలవారీ డబ్బులు చెల్లించినా టికెట్ కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వస్తున్నది. ఇటీవల మల్లేష్ అనే వ్యక్తి నెలవారీ బస్ పాస్ మెట్రో ఎక్స్‌ప్రెస్ పాస్ తీసుకున్నాడు. అందు కోసం సర్వీస్ చార్జీతో 1630 చెల్లించాడు. నవంబర్ 8 నుంచి డిసెంబర్ 8 వరకు ఈ బస్ పాస్ వినియోగంలో ఉండాల్సి ఉంటుంది.

అయితే ఈ పాస్‌పై ఆర్ఆర్‌బీ -ఐడీ 2617160173 ఉంది. ఆర్టీసీ ఐడీ కార్డులో మాత్రం ఆర్ఆర్‌బీజెడ్ ఐడీ 2617135527 ఉంది. దీంతో ఐడీ కార్డులో ఒక నంబర్, బస్ పాస్‌లో మరో నంబర్ ఉంది. అయితే ఈ బస్సు పాస్‌తో ప్రయాణికుడు తన గమ్యస్థానానికి బస్ ఎక్కగా కండక్టర్ పాస్ చెల్లదని చెప్పాడు. సదరు ప్రయాణికుడు అవాక్కయ్యాడు. అదేంటి బస్సు పాస్ చెల్లదంటున్నారని కండక్టర్‌ను నిలదీయగా ఐడీలో ఒక నంబర్, పాస్‌లో మరో నంబర్ ఉందని వారించాడు. ఆర్టీసీ సిబ్బంది చేసిన తప్పిదానికి తానెందుకు టికెట్‌కు డబ్బులు చెల్లించాలని నిలదీశాడు.

అయితే కండక్టర్ ఆ బస్ పాస్ చెల్లదని బస్ దించాడు. దీంతో సదరు వ్యక్తి సంబంధిత ఈసీఐఎల్ డిపోకు వెళ్లి ప్రశ్నించగా మీకు బస్ పాస్ జారీ చేసిన వ్యక్తి రాలేదని, వచ్చాక రండి అంటూ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. దీంతో ఆ వ్యక్తి ఎప్పుడొస్తాడో తెలియక తన విధులు మానుకొని డిపోకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. రోజు నగరానికి, ఇంటికి ప్రయాణించే అతడు రూ.120 టికెట్ కోసం ఖర్చు పెట్టాల్సి వస్తున్నది. నవంబర్ 8 నుంచి అంటే 5 రోజులకు రూ. 600 వరకు డబ్బులు ఖర్చు చేసుకున్నాడు. పాస్ ఉన్నా ఇలాంటి పరిస్థితి వచ్చిందని బాధితుడు వాపోయాడు. బస్సు పాస్ ముద్రణలో తప్పిదంగా పరిగణించి బస్సులో ప్రయాణానికి అంగీకరించినా తనిఖీ సిబ్బంది తమకు నోటీస్ ఇస్తారని, జరిమానా చెల్లించాల్సి ఉంటుందని కండక్టర్లు చెబుతున్నారు.

అయితే బస్ పాస్ జారీ చేసే సమయంలోనే ప్రయాణికుడి వివరాలు, ఐడీ నంబర్ , టికెట్ నంబర్ సక్రమంగా ఉన్నాయా లేదా అన్నది పరిశీలించాల్సిన బాధ్యత ఆర్టీసీ అధికారులపై ఉంది. కంప్యూటరైజ్డ్ విధానంలో పాస్‌లు జారీ చేస్తున్నప్పటికీ ఇలాంటి వ్యత్యాసాలు ఎలా చోటుచేసుకుంటున్నయన్నది చర్చనీయాంశంగా మారింది. కొంతమంది అమాయకులు బస్ పాస్ ముఖ్యంగా భావిస్తుండంతో డిపోల చుట్టూ తిరగలేక కొత్త పాస్ తీసుకుంటున్నారని బాధితులు చెబుతున్నారు. పాస్‌లు జారీచేసే సిబ్బంది ప్రయాణికులతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రేటర్‌లో 43 బస్ పాస్ కేంద్రాల్లో సగానికి పైగా ఇలాంటి తప్పిదాలే కనిపిస్తున్నాయని చెబుతున్నారు.

శత్రువుకు కోలుకునే సమయం ఇవ్వకుండా దెబ్బతీయాలి

పర్యవేక్షణ వ్యవస్థలను పటిష్ఠం చేయాలని, శత్రువు ప్రతిస్పందించేలోపే విరుచుకుపడే వ్యూహాలను సిద్ధం చేసుకోవాలని రాజ్‌నాథ్ సింగ్ సూచించారు. నేటి కాలంలో యుద్ధాలు కేవలం సరిహద్దులకే పరిమితం కాకుండా ఎలక్ట్రానిక్, సైబర్, అంతరిక్ష రంగాలకు విస్తరించాయని వివరించారు. ఆధునిక యుద్ధాల్లో డ్రోన్లు, గగనతల రక్షణ వ్యవస్థలు అత్యంత కీలకంగా మారాయని చెప్పారు. కౌంటర్-డ్రోన్ ఆపరేషన్ల కోసం ప్రత్యేక విధానాలను రూపొందించాలన్నారు. త్రివిధ దళాల మధ్య సమన్వయం, సంయుక్త కార్యాచరణ భవిష్యత్ సైనిక ప్రణాళికలకు మార్గదర్శకంగా నిలవాలని రాజనాథ్ సింగ్ పిలుపునిచ్చారు.ం"శత్రువు ప్రతిస్పందించడానికి లేదా కోలుకోవడానికి ఏమాత్రం సమయం ఇవ్వని సామర్థ్యాలను, పద్ధతులను మన రక్షణ దళాలు అభివృద్ధి చేసుకోవాలి. అదే సమయంలో, శత్రువు నుంచి వచ్చే ఆకస్మిక చర్యలకు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. ఇందుకు సంబంధించి మన నిఘా యంత్రాంగాలను మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉంది."

'సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి'

నేటి కాలపు యుద్ధాలు సంప్రదాయ యుద్ధభూములను దాటి సంబంధం లేని రంగాలకు విస్తరిస్తున్నాయని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఇందులో క్షిపణులు, డ్రోన్లు, అధునాతన ఆయుధ వ్యవస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. ఎలక్ట్రానిక్, సైబర్ అంతరిక్ష రంగాలతో సహా, అభివృద్ధి చెందుతున్న యుద్ధ రంగాల కోసం ప్రత్యేక సిద్ధాంతాలు, నిర్మాణాలను అభివృద్ధి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ రంగాల్లో మెరుగైన సంసిద్ధత, భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచుతుందని నొక్కి చెప్పారు. భవిష్యత్ యుద్ధాల్లో విజయం కేవలం విమానాల సంఖ్యపైనే కాకుండా, సాంకేతిక నైపుణ్యం, ప్రతిస్పందన వేగం, సన్నాహాల కచ్చితత్వంపై కూడా ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు. మరోవైపు, రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్-హమాస్ ఘర్షణలను ప్రస్తావిస్తూ, డ్రోన్లు, వాయు రక్షణ వ్యవస్థలు ఆధునిక యుద్ధంలో కీలక అంశాలుగా ఆవిర్భవించాయని పేర్కొన్నారు. ఆత్మాహుతి డ్రోన్లు, నిఘా, డ్రోన్ వ్యతిరేక కార్యకలాపాల వంటి కొత్తగా ఎదురయ్యే సవాళ్లకు సిద్ధంగా ఉండాలని ఆయన కమాండర్లకు పిలుపునిచ్చారు.

ఐఏఎఫ్‌పై ప్రశంసలు

ఆపరేషన్ సింధూర్ సమయంలో త్రివిధ దళాలు ప్రదర్శించిన సమన్వయ, పరస్పర సహకారాన్ని రక్షణ మంత్రి కొనియాడారు. ఆపరేషన్ సమయంలో, ఆ తర్వాత తమ సిద్ధాంతాలను, కార్యాచరణ పద్ధతులను సమర్థవంతంగా అమలు చేసినందుకు ఐఏఎఫ్‌ను ప్రశంసించారు. అలాగే, తమకు అప్పగించిన పనులను విజయవంతంగా పూర్తి చేయడంలో వాయు యోధులు ప్రదర్శించిన వృత్తి నైపుణ్యం, సంయమనం, విచక్షణను ఆయన అభినందించారు. సైనిక ప్రణాళిక, కార్యాచరణ అమలుకు ఉమ్మడితత్వం, సమగ్ర ప్రయత్నాలు మార్గదర్శకంగా కొనసాగాలని ఆయన నొక్కి చెప్పారు. వేగవంతమైన సాంకేతిక పురోగతికి అనుగుణంగా తన సిబ్బంది నైపుణ్యాలు, సామర్థ్యాలను మెరుగుపరుస్తున్నందుకు ఐఏఎఫ్‌ను అభినందిస్తూనే, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలలో వాయు యోధులకు శిక్షణ ఇచ్చే ప్రయత్నాలను కొనసాగించాలని చెప్పారు. యువ రిక్రూట్‌ల సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలను ఉపయోగించుకోవాల్సిన ప్రాముఖ్యతను రాజ్‌నాథ్ సింగ్ నొక్కి చెప్పారు. వారి సామర్థ్యాలు మెరుగైన నిర్ణయాలు తీసుకోవడానికి, సంస్థాగత అభివృద్ధికి గణనీయంగా దోహదపడతాయని పేర్కొన్నారు. విధానపరమైన నిర్ణయాలలో సాయుధ దళాల సూచనలను పరిగణనలోకి తీసుకోవడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు.

రాష్ట్రంలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

రాష్ట్రంలో 21 సీనియర్ ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి మహేశ్ మురళీధర్ భగవత్ నియమితులయ్యారు. ఇప్పటివరకు సీపీగా బాధ్యతలు నిర్వహించిన వీసీ సజ్జనర్‌ను తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ డీజీగా బదిలీ చేశారు. దీంతోపాటు ఎస్పీఎఫ్ డీజీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు ఆదేశాలు జారీ చేశారు.

ఏసీబీ డీజీగా చారుసిన్హా..

సౌమ్య మిశ్రాను మహిళా భద్రత, షీటీమ్స్, భరోసా డీజీపీగా నియమించిన ప్రభుత్వం, అదనంగా డీజీపీ ఆర్గనైజేషన్, లీగల్ బాధ్యతలను అప్పగించింది. స్వాతిలక్రాను జైళ్ల శాఖ డీజీపీగా బదిలీ చేసి, హోంగార్డ్స్ అదనపు బాధ్యతలు అప్పగించారు. చారు సిన్హాకు ఏసీబీ డీజీగా నియామకంతోపాటు సీఐడీ డీజీ బాధ్యతలు అప్పగించింది. అనిల్‌కుమార్‌ను తెలంగాణ ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించింది. ఇప్పటి వరకు ఆర్టీసీ బాధ్యతలు చూసిన వై.నాగిరెడ్డిని పౌరసరఫరాల కమిషనర్‌గా నియమించింది. సంజయ్‌కుమార్ జైన్‌కు డీజీపీ ట్రైనింగ్ అదనపు బాధ్యతలు ఇచ్చింది. విక్రమ్‌సింగ్ మాన్‌ను గ్రేహౌండ్స్, ఆక్టోపస్ డీజీపీ (ఆపరేషన్స్)గా నియమించింది. స్టీఫెన్ రవీంద్రను తెలంగాణ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్ అండ్ రైల్ సేఫ్టీ బ్యూరో డైరెక్టర్‌గా బదిలీ చేసింది. హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీగా ఉన్న జోయల్ డేవిస్‌కు టీజీ-టీమార్స్ (రోడ్ సేఫ్టీ) జాయింట్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. శ్రీ బాలాదేవిని టీజీ-టీమార్స్ డిప్యూటీ డైరెక్టర్ (అడ్మిన్)గా నియమించింది.

లా అండ్ ఆర్డర్ డీజీపీగా అకున్ సబర్వాల్..

అకున్ సబర్వాల్‌ను అదనపు డీజీపీ లా అండ్ ఆర్డర్‌గా, ఎస్.చంద్రశేఖర్ రెడ్డిని ఏసీబీ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. కార్తికేయను ఐజీపీ మల్టీ జోన్-1గా బదిలీ చేసి, ఐసీసీసీ డైరెక్టర్ అదనపు బాధ్యతలు అప్పగిం చింది. కె.రమేశ్ నాయుడును రైల్వే ఐజీగా నియమించింది. చందన దీప్తికి జోగులాంబ రేంజ్ డీఐజీ, ఆర్. భాస్కరన్‌కు ఇంటిలిజెన్స్ డీఐజీగా నియమించింది. కె. నారాయణ నాయక్‌కు బాసర్ డిఐజి గా, ఎల్.ఎస్. చౌహాన్‌కు చార్మినార్ డీఐజీతో పాటు కోఆర్డినేషన్ బాధ్యతలు అప్పగించింది. అరవింద్ బాబును హైదరాబాద్ సిటీ డీసీపీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

వైట్‌హౌస్ సమీపంలో కాల్పులు- వీధులను దిగ్బంధించిన పోలీసులు

అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీ తుపాకుల శబ్దంతో దద్దరిల్లింది. వైట్ హౌస్‌కు అతి సమీపంలోని లోగాన్ సర్కిల్‌లో గుర్తుతెలియని దుండగుడు ఐదుగురిపై కాల్పులు జరిపాడు. కాల్పుల జరిపిన అనంతరం దుండగుడు అక్కడ నుంచి పరారయ్యాడు. ఈ ఘటనలో ఐదుగురు వ్యక్తులు బుల్లెట్ గాయాలకు గురికాగా, వారిలో ఒకరు మరణించినట్లు మెట్రోపాలిటన్ పోలీస్ డిపార్ట్‌మెంట్ తాత్కాలిక చీఫ్ జెఫ్రీ కారోల్ వెల్లడించారు. కాల్పులకు పాల్పడిన అనుమానితుడు సమీపంలోని ఒక అపార్ట్‌మెంట్ భవనంలోకి వెళ్లి తనను తాను కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు.

ఈ ఘటన నేపథ్యంలో వైట్‌హౌస్ చుట్టుపక్కల వీధులను పోలీసులు దిగ్బంధించారు. భారీ ఎత్తున భద్రతా దళాలను మోహరించారు. ముందుజాగ్రత్త చర్యగా శ్వేతసౌధం సమీపంలోని పాఠశాలలకు లాక్‌డౌన్ విధించారు. శ్వేతసౌధం పరిసర ప్రాంతాలకు ప్రజలెవరూ రావద్దని పోలీసులు సూచించారు.

కాల్పుల ఘటనపై దర్యాప్తు చేసేందుకు ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఆల్కహాల్, టొబాకో, ఫైర్ ఆర్మ్స్ అండ్ ఎక్స్‌ప్లోజివ్స్ ఏజెంట్లు కూడా రంగంలోకి దిగారు. కాల్పుల సమయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్ హౌస్‌లో ఉన్నారా లేదా అన్న దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఈ ఘటనపై జిమ్‌లో ఉన్న జేమ్స్ స్పెల్‌మాన్ మాట్లాడుతూ, "ఉదయం 8 గంటల ప్రాంతంలో 15వ వీధిలోని 'విడా (VIDA) ఫిట్‌నెస్ సెంటర్'లో సుమారు 50 మంది వ్యాయామం చేస్తుండగా నిందితుడు లోపలికి ప్రవేశించాడు. అందరూ చూస్తుండగానే ఒక్కసారిగా కాల్పులు జరిపాడు. తొలుత జిమ్‌లో ఒకరిని కాల్చిన అనంతరం, బయటకు వచ్చి మరికొందరిపై కాల్పులు జరిపాడు.

ఆ తర్వాత పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్ భవనంలోని పార్కింగ్ గ్యారేజ్ ఎలివేటర్‌లో మరో వ్యక్తిపై కాల్పులు జరిపాడు. ఆ తర్వాత భవనం ఏడో అంతస్తులోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. భవనంలోని హోమ్ ఓనర్స్ అసోసియేషన్‌తో ఉన్న వివాదం ఉన్నట్లు తెలుస్తోంది" అని ఆయన చెప్పారు.

డిసెంబర్ నాటికి ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం పూర్తి కావాలి

ప్రజారోగ్యానికి పెద్దపీట వేశాం.. ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పడకల సంఖ్యను 30 వేల నుంచి 38 వేలకు పెంచామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఒక్కో కుటుంబానికి అందించే వైద్య చికిత్సల కవరేజీని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచిన విషయాన్ని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. టిమ్స్‌తో పాటు బోధన కళాశాలలు, నర్సింగ్ కళాశాలల పనులు, పరికరాల కొనుగోలు ప్రక్రియ ఏకకాలంలో పూర్తవ్వాలని, అందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఏఐ పర్యవేక్షణతో ప్రభుత్వ ఆసుప్రతుల్లో వైద్యులు, సిబ్బంది హాజరు విషయంలో బయోమెట్రిక్ విధానం అమలు చేయాలని ఆదేశించారు.

ఆరోగ్య రంగానికి అధిక నిధులు కేటాయిస్తున్నాం.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఔట్ పేషెంట్ల సంఖ్య 7 కోట్ల నుంచి 9 కోట్లకు పెరగడం, ఇన్‌పేషెంట్ల సంఖ్య 23 లక్షల నుంచి 24.30 లక్షలకు పెరగడంపై ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి గతంలో సగటున 3.9 శాతం కేటాయించగా, గత మూడేళ్లుగా సగటున 4.8 శాతం నిధులు కేటాయిస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. మూడేళ్లలోనే వైద్యులు, నర్సులు, ఏఎన్ఎంలు, పారామెడికల్ సిబ్బంది కలిపి 13,401 నియామకాలు పూర్తి చేశామని తెలిపారు. మరో 5,640 నియామకాల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ప్రజారోగ్యానికి పెద్ద పీట వేసే క్రమంలో వైద్యారోగ్య శాఖకు అవసరమైన నిధులను ఎంత మొత్తమైనా విడుదల చేస్తామని స్పష్టం చేశారు.

ఏపీకి దిగ్గజ సంస్థల పెట్టుబడులు.. సీఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పందాలు

విశాఖపట్నం వేదికగా జరుగుతున్న సీఐఐ సమ్మిట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారిశ్రామిక రంగానికి సంబంధించి కీలక పురోగతి లభించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో దేశ విదేశాలకు చెందిన ప్రముఖ పారిశ్రామిక దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అధికారికంగా ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. రిలయన్స్, గెయిల్ (GAIL), సెయింట్ గోబెయిన్, ఎల్ అండ్ టీ (L&T), గ్రీన్‌కో ఎనర్జీస్ వంటి ప్రముఖ సంస్థలతో ఈ సదస్సులో కీలక ఒప్పందాలు జరిగాయి. ఈ సంస్థలు వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి.

అదేవిధంగా, రాష్ట్రంలో తమ పరిశ్రమల కార్యకలాపాలను ప్రారంభించేందుకు క్లీన్ ఎనర్జీస్ సొల్యూషన్స్, హిందుస్థాన్ కోకా-కోలా బేవరేజెస్, కెల్లాగ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన అనుమతులు మంజూరు చేసింది. ఇందుకు సంబంధించిన అధికారిక జీవో (GO) ప్రతులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయా సంస్థల ప్రతినిధులకు స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, కొల్లు రవీంద్ర, డోలా బాలవీరాంజనేయ స్వామితో పాటు వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, పలు సంస్థల ముఖ్య ప్రతినిధులు ఈ వేడుకకు హాజరయ్యారు. పరిశ్రమల ఏర్పాటు, వేగవంతమైన అనుమతుల ద్వారా రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు

తాగునీటి సంక్షోభం ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం-

ఎస్సి కార్పొరేషన్ మాజీ చేర్మెన్ వై. నరోత్తం



సమస్త ప్రక్షాళనం సంగారెడ్డి జిల్లా ఇన్చార్జ్ ఎస్ రాజు 13 నవంబర్ 2026 పరిశ్రమలకు నీటి సరఫరా నిలిపివేసి ప్రజల తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలి

జహీరాబాద్ నియోజకవర్గంలో రాబోయే రోజుల్లో తీవ్ర తాగునీటి సమస్య ఏర్పడే ప్రమాదం ఉందని

జహీరాబాద్ కు రోజుకు సుమారు 40 ఎంఎల్డీ (మీణ కోట్ల లీటర్లు తాగునీరు అవసరం. ప్రస్తుతం బుసిరెడ్డిపల్లి,రాఘవాపూర్, పాంపాడ్ ప్రాంతాల నుంచి సింగూరు జలాశయం ఆధారంగా నీటి సరఫరా జరుగుతోంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో మరో 15--20 రోజుల్లో ఈ నీటి సరఫరా నిలిచిపోయే ప్రమాదం ఉందని, ఆ తర్వాత భూగర్భ జలాలపైనే ప్రధానంగా ఆధారపడాల్సి వస్తుందని అన్నారు. ప్రజలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాల్సిన పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందన్నారు.

ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సరిగా కురవకపోవడం ఒక కారణమైతే,సింగూరు జలాశయంలోని నీటిని ముందస్తు ప్రణాళిక లేకుండా ఖాళీ చేయడం,గోదావరి జలాలను సకాలంలో ఎత్తిపోసుకోకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు దాదాపు 850 టీఎంసీల గోదావరి జలాలు దిగువకు వృథాగా వెళ్లిపోయాయని, వాటిని సద్వినియోగం చేసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

జహీరాబాద్‌లోని అలానా, హాట్సన్ తదితర ప్రధాన పరిశ్రమలకు రోజుకు సుమారు 3 ఎంఎల్డీ నీటిని వినియో గిస్తున్నట్లు అంచనా. ప్రజలకు తాగునీటి కొరత ఏర్పడే పరిస్థితుల్లో పరిశ్రమలకు నీటి సరఫరాను తక్షణమే నిలిపివేయాలి.ఆ పరిశ్రమలు వినియోగిస్తున్న బోర్లపై సమగ్ర విచారణ జరిపి,అవసరమైతే చట్టప్రకారం వాటిని స్వాధీనం చేసుకుని ప్రజల తాగునీటి అవసరాలకు వినియోగించాలి.

అలానా,హాట్సన్ తదితర పరిశ్రమలకు తాగునీటి వనరుల నుంచి నీటి సరఫరాను నిలిపివేసి, వాటి భూగర్భ జల వినియోగంపై విచారణ జరపాలి.

ప్రజలకు తాగునీరు అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత. పరిశ్రమల ప్రయోజనాల కంటే ప్రజల ప్రాణాలు, ఆరోగ్యం, తాగునీటి అవసరాలకే ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి.నీరు సమృద్ధిగా ఉన్న బోర్లను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలి

ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం మేల్కొని చర్యలు చేపట్టకపోతే జహీరాబాద్ ప్రజలు తీవ్ర తాగునీటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో నాయకులు రామ చంద్రా రెడ్డి,శివకుమార్,యం.డి.సలీమ్,కీరు,లు పాల్గొన్నారు

భారత రాజ్యాంగం బహుజనుల ఐక్యతకే సంగారెడ్డి

అంబేద్కర్ భవన్లో 8 డిసెంబర్ జిల్లా సదస్సు





పటాన్ చెరువు నియోజకవర్గంలో తన నివాసం లో నీలం మధు చేతుల మీదుగా కరపత్రం విడుదల మహాసభలను విజయవంతం చేయండి

సమస్త ప్రక్షాళనం సంగారెడ్డి జిల్లా ఇన్చార్జి ఎస్ రాజు 13 నవంబర్ 2026 సంగారెడ్డి లోనీ అంబేద్కర్ భావన్లో జరిగే "భారత రాజ్యాంగంబహుజనుల ఐక్యత కై నిర్వహించే సభకు సంబశీదించిన కరపత్రం నీలం మధు నివాసం లో విడుదల చేయడం జరిగింది ఇటీ కార్యక్రమని ఉదేశించి మాట్లాడారు జిల్లా లోని బహుజన సమాజం అంత కులామతాలకు అతీతంగా ఐక్యమత్యంగా ముందుకు సాగాలని పిలునిచ్చారు భారత రాజ్యాగం మే మన దేశ భవిష్యత్తు కు పునాది అన్ని పునరుద్ఘాటించారు ఈ కార్యక్రమంలో మేధావులు రచయితలు, కవులు బహుజన సంఘాల నాయకులు అంబేద్కర్ వాదులందరు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమం లో నిర్వకులు బహుజన సాహిత్య అకాడమీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు సామ్రాట్ గోవర్ధన్ బహుజన చైతన్య సమితి వ్యవస్థపాక రాష్ట్ర అధ్యక్షులు ఎర్రారం దేవదాస్ తదితరులు పాల్గొన్నారు

భారీగా బాణాసంచా నిల్వ



అధికారుల కళ్లుగప్పి.. నిబంధనలు తుంగలో తొక్కి..

ఏదైనా ప్రమాదం జరిగితే పెద్ద ఎత్తున ప్రాణ నష్టం

సమస్త ప్రక్షాళనంహత్నూరత్యంత ప్రమాదకరమైన పేలుడు స్వభావం గల టపాసుల అక్రమ నిల్వల వ్యవహారం ప్రజల్లో ఆందోళన కలిగిస్తుంది.సంబంధిత శాఖల నుండి ఎలాంటి అనుమతులు పొందకుండానే నిర్వాహకులు పెద్ద ఎత్తున బాణాసంచాను డంప్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నివాస గృహాలకు దగ్గరగా జనసంచారం ఉన్నచోట టపాసుల డబ్బాలను పెద్ద మొత్తంలో నిల్వ చేస్తున్నారు.సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం మల్కాపూర్ గ్రామం బస్టాండ్ వద్ద నర్సాపూర్-సంగారెడ్డి ప్రధాన రహదారికి అనుకుని ఉన్న దుకాణ సముదాయంలో బుధవారం రాత్రి డిసిఎం వాహనంలో నుండి పెద్ద ఎత్తున టపాసుల డబ్బాలను అన్ లోడ్ చేస్తున్న దృశ్యాన్ని స్థానికులు వారి సెల్ ఫోన్ కెమెరాలో బంధించారు.మందుగుండు సామగ్రిని జనావాసాలకు దగ్గర్లో నిల్వ చేయడం ద్వారా ఏదైనా అనుకోని ప్రమాదం చోటుచేసుకుని విస్పోటనం జరిగితే ప్రజల ప్రాణాలు గాల్లో కలిసే ప్రమాదం ఉందని .ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అధికారుల కళ్లుగప్పి:- బాణాసంచా నిర్వాహకులు ఎంతో చాకచక్యంగా వ్యవహరించి అధికారుల కళ్లుగప్పి టపాసులను డంప్ చేస్తున్నారు.రాత్రి సమయంలో డిసిఎం,లారీ లాంటి వాహనాల్లో పెద్ద ఎత్తున బాణాసంచా డబ్బాలను తీసుకొచ్చి వారికి అనుకూలమైన ప్రదేశంలో నిల్వ చేస్తూ పోలీసులకు సవాలు విసురుతున్నారు.నిబంధనలకు నీల్లొదిలి:- టపాసుల నిల్వ, విక్రయాల కోసం నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి.ప్రభుత్వం నిర్దేశించిన భద్రతా నిబంధనలను పాటించాలి.బాణాసంచా నిల్వ చేసే చోటు జనావాసాలకు దూరంగా ఉండేలా చూడాలి.నిర్వహకులు అవేవి పట్టించుకోకుండా వారి ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ప్రమాదాలకు బాటలు వేస్తున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం:- బాణాసంచా నిల్వ చేసిన చోట ఏదైనా అనుకోని ప్రమాదం సంభవిస్తే దాని ప్రభావం అక్కడితో ఆగకుండా చుట్టు పక్కల ప్రాంతాలకు విస్తరించే ప్రమాదం ఉంది.అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుంది.ఎలాంటి దుర్ఘటనలు జరగకుండా సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.సమన్వయ లోపం:- పేలుడు స్వభావం కలిగిన టపాసుల నిల్వ, విక్రయాల విషయంలో అధికారుల మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. భద్రతా ప్రమాణాలు, నిల్వ కేంద్రాలపై ఎప్పటికప్పుడు నిఘా పెడుతూ పర్యవేక్షించాల్సిన సంబంధిత పోలీసు, రెవెన్యూ,అగ్నిమాపక శాఖలు నిద్దురపోతున్నాయి. అనుమతుల రికార్డులు,నిబంధనలకు అనుగుణంగా నిల్వలు ఉన్నాయా లేదా అనేది క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అనంతారం రైతులకు 22-ఏ నిషేధిత జాబితా కష్టాలు

169 ఎకరాల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలి

తొలగిస్తామని ప్రకటించినా అమలుకాని ప్రభుత్వ హామీ..

రైతులకు న్యాయం చేయకపోతే బాధితుల పక్షాన పోరాటం..

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి



సమస్త ప్రక్షాళనం/జిన్నారం :-గుమ్మడిదల మండలం అనంతారం గ్రామ పరిధిలోని భూములను 22-ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి బాధిత రైతులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 173లోని 59 ఎకరాలు, సర్వే నంబర్ 174/1 నుంచి 174/10 వరకు ఉన్న 110 ఎకరాల భూములను నిషేధిత జాబితాలో చేర్చడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గురువారం గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని సీజీఆర్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. 22-ఏ నిషేధిత జాబితా నుంచి రైతుల భూములను తొలగిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించినప్పటికీ, నేటికీ ఆ ప్రకటన కార్యరూపం దాల్చకపోవడం సిగ్గుచేటని విమర్శించారు.నిషేధిత జాబితాలో భూములు ఉండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేసి రైతులకు ఉపశమనం కల్పించాలని కోరారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌లకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు.

పశువులకు ఉచిత వైద్య సేవ శిబిరం

పాల్గొన్న స్థానిక కౌన్సిలర్ కుమ్మరి కృష్ణ



సమస్త ప్రక్షాళనం /జిన్నారం :- గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని లక్ష్మీపతి గూడెం 17వ వార్డు కౌన్సిలర్ కుమ్మరి కృష్ణ ఆధ్వర్యంలో శ్రీ సత్య సాయి బాబా ట్రస్ట్ సహకారంతో పశువులకు ఉచిత వైద్య సేవ శిబిరం ఏర్పాటు చేశారు. గొర్రెలు గేదలు పశువులకు నట్టల నివారణకు మందులు పంపిణీ చేసి సుడి గేదలను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. పశువులకు సంబంధిత వ్యాధుల పరీక్షించి నిర్మూలనకు సత్యసాయి బాబా ట్రస్ట్ బృందం ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని కౌన్సిలర్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీ సత్య సాయి బాబా ట్రస్ట్ పశువు వైద్యుల బృందం గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలి.



సమస్త ప్రక్షాళనం, రేగోడు:- రాష్ట్రంలో నెల కొన్న సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతు లు అధిక నీటి అవసరమయ్యే వరి పంటలకు బదు లు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని తెలిపారు.మండల కేంద్రమైన రేగోడు, కొండాపూర్ గ్రామపంచాయతీలలో గురువారం నిర్వహించిన గ్రామసభలో ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కార్యక్రమాన్ని మండల అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వచ్చే యాసంగి సీజన్‌లో వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు.ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులతో ప్రాజెక్టుల్లో నీటినిల్వలు తగ్గాయని,గత ఏడాదితో పోలిస్తే భూగర్భ జలాలు తగ్గిపోయాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులు వరి సాగుకు బదులు చిరుధా న్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజల పంటలు,ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలని కోరారు. అవస రమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, వ్యవ సాయ శాఖ అధికారుల నిరంతరం నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలను రైతు లు సద్వినియోగం చేసుకోని వారి సూచనల మేరకు సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారిణి శ్రీదేవి మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం అవకాశాలను దృష్టిలో ఉంచుకొని రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని సూచించారు. వరి సాగును తగ్గించి, నీటి లభ్యతను బట్టి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని తెలిపారు. ముఖ్యంగా కూరగాయలు, నూనెగింజల పంటల సాగు ద్వారా రైతులు మెరుగైన ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని వివరించారు. రైతులు వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తూ నాణ్యమైన దిగుబడులు సాధించాలని అధికారులు సూచించారు.కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ పర్వీన్ సుల్తానా చోటుమియా,కొండాపూర్ సర్పంచ్ పండరి పంచాయతీ కార్యదర్శి అరుణ్ కుమార్,రైతులు తదితరులు పాల్గొన్నారు.

అత్తల యాదిలో కోడళ్లు దానదర్మాలు



సమస్త ప్రక్షాళనం హత్నూర సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని నస్తీపూర్ వెలుగు గ్రామైక్య సంఘం నెల వారి సాధారణ సమావేశం జరిగింది.ఈసందర్భంగా గ్రామ సంఘం లో స్వీపర్ గా పని చేసిన కీ.శే.ఎల్లకొండ సత్తెమ్మ పేరు మీద ఆమె కోడలు ప్రస్తుత గ్రామ సర్పంచ్ ప్రమీల సాయిలు 50 కుర్చీలు దానం చేయడం జరిగింది. అదే విధంగా గ్రామ సంఘం అధ్యక్షురాలు గా పని చేసిన కీ.శే.బుచ్చిరెడ్డి కళావతి పేరు మీద ఆమె కోడలు శ్రీలత ఒక మైక్ సెట్, క్యాష్ కౌంటింగ్ మిషన్ దానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిసి సావిత్రి మాట్లాడుతూ నస్తీపూర్ గ్రామైక్య సంఘం అందరికీ ఆదర్శంగా నిలవడానికి గ్రామ మహిళల ఆదర్శ భావాలే ప్రధాన కారణం అన్నారు.ఇలాంటి దాతృత్వ గుణం ఊర్లో అందరికీ ఉండటం చేతనే ఆడపిల్ల పుడితే ఊరంతా పండుగ లాంటి కార్యక్రమాలు విజయవంతంగా చేస్తున్నామన్నారు . తదనంతరం దాతలకు మరియు ఇటీవల ఎస్‌సిఆర్‌టి గా శిక్షణ పొంది సంగారెడ్డి జిల్లా లోని 12 మండలాల్లో శిక్షణ ఇస్తున్న గ్రామానికి చెందిన యాస్మిన్ కి సన్మానాలు చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రమీల సాయిలు ఉపసర్పంచ్ మహేందర్ కార్యదర్శి యాదయ్య గ్రామ సంఘం కార్యదర్శి సుజాతా, కోశాధికారి అక్షయ,సిసి సావిత్రి,విఒఎ ప్రవీణ్, గ్రూప్ లీడర్లు పాల్గొన్నారు.

గంగారంలో విద్యార్థులకు తప్పని నీటి కష్టాలు











సమస్త ప్రక్షాళనం- కొండాపూర్ మండల పరిధిలోని గంగారం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నీటి తిప్పలు తప్పడం లేదు. గురువారం విద్యార్థులు మధ్యాహ్న భోజనం అయిన తర్వాత తమ ప్లేట్లు కడుక్కోవడానికి నీళ్లు లేక పాఠశాల ముందు ఉన్నటువంటి పశువులు త్రాగడానికి కట్టించిన నీటి సంపులో తమ ప్లేట్లు కడుక్కోవడానికి వచ్చి అక్కడే ప్లేట్లు కడుక్కుంటున్న చిత్రం సమస్త ప్రక్షాళనం కెమెరాకు చిక్కింది. దీంతో పాఠశాల విద్యార్థులకు ఎన్ని సౌకర్యాలు ఉన్న కానీ నీటి సమస్యలు ఉన్నాయంటూ తెలిపే ఈ చిత్రం పలువురుని ఆశ్చర్యపరుస్తుంది. ఇప్పటికైనా గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి మరియు ఉప సర్పంచ్, వార్డ్ మెంబర్ బృందం వెంటనే ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా స్పందించి విద్యార్థులకు ఎలాంటి కష్టాలు రాకుండా చూసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎవరికి పట్టని సర్వసభ్య సమావేశం




చాయ్ సమోసాలతో సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

--పూర్తిస్థాయిలో హాజరు కాని ప్రభుత్వ అధికారులు

వివిధ గ్రామాల సర్పంచులు

సమస్త ప్రక్షాళనం- కొండాపూర్

ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం అధికారుల నిర్లక్ష్యంతో పూర్తిస్థాయిలో హాజరుకాని సర్పంచులతో, సమయపాలన పాటించని అధికారులతో చాయి సమోసాలతో సాదాసీదాగా ముగిసింది. కొండాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సౌమ్యశ్రీ అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో సభ్యులకు అందించాల్సిన ఏజెండా అంశాల పత్రాలు అందుబాటులో లేకపోవడంపై, సర్పంచులు పూర్తిస్థాయిలో హాజరు కాకపోవడంతో, మండలంలో మండల డెవలప్మెంట్ ఆఫీసర్ ఎంపీడీవో, మరియు ఎంపీఓల పనితీరు ఇట్టే అర్థమవుతుంది. అదేవిధంగా అధికారులు కూడా సమయపాలన పాటించకపోవడం వారి విధి నిర్వహణ తీరు ఈ సమయపాలన విషయంలోనే అర్థమవుతుంది. అంతేకాకుండా ఈ సర్వసభ్య సమావేశానికి హాజరైన సర్పంచులు తమ గ్రామ సమస్యలు సమావేశంలో పూర్తిస్థాయిలో విన్నవించిన ఏ స్థాయిలో అధికారులు ఆ సమస్యలను పరిష్కరిస్తారో పరిష్కరించరో అనేది గురువారం



జరిగిన సమావేశంలో చర్చించిన సమస్యల వచ్చిన వివరణ మరొక సర్వసభ్య సమావేశం నిర్వహించే వరకు అధికారుల తీరు అర్థం అవుతుంది. సర్వసభ్య సమావేశం అనగా

మరియు ఈ యొక్క సమావేశం యొక్క ముఖ్య ఉద్దేశం

లి విధాన నిర్ణయాలు తీసుకోవడం. పరిపాలనా విభాగం యొక్క భవిష్యత్తు ప్రణాళికలు మరియు కొత్త నియమాలపై సభ్యులందరూ కలిసి చర్చించి ఆమోదం తెలుపుతారు.

లి నివేదికలు మరియు లెక్కల పరిశీలన. గత కాలంలో జరిగిన పనులు, ఆర్థిక లావాదేవీలు, బడ్జెట్ మరియు అభివృద్ధి కార్యక్రమాలను సభ్యుల ముందు ఉంచి సమీక్షిస్తారు.

లి సమస్యల పరిష్కారం. సభ్యులు లేదా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి తగిన పరిష్కార మార్గాలను నిర్ణయిస్తారు.

లి ఎన్నికలు మరియు నియామకాలు. పరిపాలనకు సంబంధించిన కొత్త కార్యవర్గ సభ్యులు, డైరెక్టర్లు లేదా కమిటీలను ఎన్నుకోవడానికి ఈ వేదికను ఉపయోగిస్తారు.

కానీ కొండాపూర్ మండలంలో ఏం జరుగుతుంది దీనికి విరుద్ధంగా ఈ సర్వసభ్య సమావేశాలు మొక్కుబడిగా చాయ్ సమోసాలతో సరిపెట్టుకుంటున్నారు.

--పూర్తిస్థాయిలో ప్రభుత్వ అధికారులు హాజరు కావడం లేదు

మరి సర్పంచులు ఎందుకు హాజరు కావడం లేదు?

పూర్తిస్థాయిలో ప్రభుత్వ అధికారులు హాజరు కావడం లేదు అనుకుందాం. మరి వివిధ గ్రామాల సర్పంచులు ఎందుకు హాజరు కావడం లేదు. అంటే వీరికి అనగా నూతనంగా ఎన్నికైన సర్పంచులకు సర్వసభ్య సమావేశం అనగా జనరల్ బాడీ మీటింగ్ అంటే వీరికి ఈ యొక్క సమావేశం పైన అవగాహన లేదా తెలియదా ఈ సమావేశం గురించి వీరికి సర్పంచులకు వార్డు మెంబర్లకు నూతనంగా ఎన్నికైన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం వీరికి ట్రైనింగ్ ఇచ్చింది ఆ ట్రైనింగ్ లో వీరికి సమావేశం గురించి చెప్పలేదా అనే అంశం వివిధ కోణాలలో పరిశీలించాల్సిన అంశం. లేదా వీరికి సమావేశం పైన అవగాహన ఉండి కూడా హాజరు కావడం లేదా. మహిళా సర్పంచులు ఉన్నారని వారు కూడా రావడానికి ఇబ్బంది పడుతున్నారా. కొండాపూర్ మండల ఎంపీడీవో ఒకసారి అన్ని గ్రామాల సర్పంచులకు సమావేశం ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో వారికి వివరించి చెప్పాల్సిన అంశం. మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు ఈ యొక్క సమావేశానికి పూర్తిస్థాయిలో హాజరై సమస్యల పైన అధికారులను నిలదీస్తే ఏ అధికారైన రావద్దు అనుకున్న అధికారి కూడా హాజరవుతారు. ఇక్కడ లోపం జరుగుతుందో ఈ పత్రిక చదువుతున్న ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సిన ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పూర్తిస్థాయిలో అధికారులు రాలేదు కాబట్టి, జిల్లా యంత్రాంగం జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి కొండాపూర్ మండలంలో జరుగుతున్న పూర్తిస్థాయిలో పర్యటించి కొండాపూర్ మండలంలో అనేక సమస్యలు గ్రామాలలో నెలకొంటున్నటువంటి ఇబ్బందులు ప్రజలు తాగునీటి కష్టాలను కరెంటు కష్టాలను అన్నిటిని స్వయంగా ప్రతి గ్రామంలో పరిశీలించి మండల వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి నిర్లక్ష్యం చేస్తున్న అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని మండలంలోని పలు సర్పంచులు మరియు ప్రజలు ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు.